క్లుప్తంగా

ముగిసిన జాతర మహోత్సవాలు



సత్తెమ్మ తల్లిని ఊరేగిస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ గ్రామ దేవత సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, కళా రూపాలు, నృత్య ప్రదర్శనలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కలశ స్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, బళ్ల సత్తిరాజు, బుట్టే శేఖర్, బల్ల సుధీర్, అంకం ప్రశాంత్, లక్కింశెట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ రక్షా వర్సిటీలో ప్రవేశాలకు ఆహ్వానం

యానాం: పుదుచ్చేరిలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ హర్షగణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ ఇన్ క్రిమినాలజీ అండ్ పోలీస్ సైన్స్, ఎంఏ, ఎమ్మెస్సీ ఇన్ క్రిమినాలజీ, సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్, సెక్యూరిటీ అండ్ కార్పొరేట్ ఇంటెలిజెన్స్ మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లమో కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆర్ఆర్‌యూ.ఏసీ.ఇన్.పుదుచ్చేరి వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

యూజీ కోర్సులకు 7,250 దరఖాస్తులు

యానాం: 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంజినీరింగ్, అగ్రికల్చర్ తదితర నాన్ నీట్ కోర్సులకు మొత్తం నాలుగు రీజియన్ల నుంచి ఇప్పటివరకూ 7,250 దరఖాస్తులు వచ్చినట్లు సెంటాక్ అధికారులు ఆదివారం తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, లా తదితర కోర్సులకు ఈ నెల గత నెల 8న సెంటాక్ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 22 వరకూ దరఖాస్తులు స్వీకరించేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు నేడు అవగాహన సదస్సు

మామిడికుదురు: మామిడికుదురు నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయంలో సోమవారం యువ, మహిళ పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని సంస్థ ఎండీ నయనాల వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు ఉద్యోగ ఆధార్ మేళా కూడా ఏర్పాటు చేశామన్నారు. ఔత్సాహిక యువ, మహిళా పారిశ్రామిక వేత్తలు తమ ఆధార్, పాన్‌కార్డులతో సదస్సుకు హాజరుకావాలని ఆయన కోరారు.

సర్వాంతర్యామి కృష్ణ భగవానుడు

అయినవిల్లి: అంతట శ్రీకృష్ణుడు కొలువై ఉన్నాడని, ఈ అనంత లోకాలు కృష్ణమయమేనని నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులో శ్రీకృష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. శ్రీకృష్ణుడు మెచ్చేటట్టు మనం జీవించాలని అప్పుడు మానవ జీవితం సార్థకం అవుతుందని భగవత్ గీత మన రాతను మారుస్తోందన్నారు. భగవత్ గీతను విన్నా, చదివినా జన్మ చరితం అవుతుందన్నారు. భగవంతుడు సూచించిన దారిలోనే మనం ప్రయాణించాలని ఆయన సూచించారు. ఆయన సేవలో తరించిన వారికే మోక్షం లభిస్తుందన్నారు. దేవాధిదేవుడు సేవ చేయడం కూడా పూర్వ జన్మ సుకృతమేనన్నారు. అనంతరం భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

క్యాన్సర్ బాధిత చిన్నారికి సాయం

రావులపాలెం: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పదేళ్ల బాలిక వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.17 వేల నగదును ఆర్థిక సాయం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బిక్కవోలు గ్రామానికి చెందిన ఏళ్ళ మేఘనశ్రీ వయస్సు పదేళ్లు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. చెన్నై ఆస్పత్రిలో 10 నెలలు ఉండి వైద్యం చేయించుకోవాలని డాక్టర్లు సూచించారు. ఈ వైద్యానికి సుమారుగా రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. మేఘనశ్రీ తండ్రి అనపర్తిలో ఒక కాలేజీలో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నారు. వైద్యం చేయించే స్తోమత లేక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరడంతో మేఘనశ్రీ తండ్రికి రూ.17 వేల నగదు సాయంగా సభ్యులు అందజేశారు.

కన్నుల పండువగా కల్యాణం



పాతకోరంగిలో కురంగేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పాతబండారులంకలో త్రయంబకేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



దేవగుప్తంలో పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు



కేశవస్వామి కల్యాణం జరుపుతున్న అర్చకులు

తాళ్లరేవు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు పెద్దింటి శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో స్వామి, అమ్మవార్లకు ప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి పండు వెన్నెలలో వేద పండితులు అంగర శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణం వేద మంత్రోచ్చారణల నడుమ, మంగళ వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా అంటూ భక్తులు గోవింద నామస్మరణలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణం

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ క్షేత్ర పాలకులు లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దాత జంపన రామకృష్ణంరాజు దంపతుల చేతుల మీదుగా కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ కొమానపల్లి గ్రామానికి చెందిన పాణంగిపల్లి సూర్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

ఘనంగా మల్లేశ్వరస్వామివారి కల్యాణం

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో కొలువై యున్న పార్వతీ సమేత మల్లేశ్వర స్వామివారి వార్షిక కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పురోహితులు చంద్రమౌళి సోమేశ్వరశర్మ, వేద పండితులు అబ్బిన శర్మ ఆధ్వర్యంలో స్వామివారి దివ్య కల్యాణం కన్నుల పండుగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పుర వీధుల్లో ఊరేగించారు.

వైభవంగా కురంగేశ్వరుని కల్యాణం

తాళ్లరేవు: కోరంగి పంచాయితీ పరిధిలో పాతకోరంగి గ్రామంలో కొలువైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీకురంగేశ్వర స్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. వేదపండితులు కందికొండ బాబి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోరంగి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ వేణుగోపాల్, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వర స్వామి దివ్య కల్యాణం

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంకలో భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితుడు సద్గురువు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయకిరణ్, సాయిరత్న ప్రియ దంపతులు కర్తలుగా వ్యవహరించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, పిచ్చిక వెంకన్న, పుచ్చల వరదరాజులు, పడవల బాలాజీ, కాశీన బాబీ, గుమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో పొగతో ఉక్కిరిబిక్కిరి

యానాం: నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ పొగ వ్యాపించడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పట్టణ ప్రాంతంతో పాటు యానాం, తాళ్లరేవు మండలంలో సైతం ఈ పొగ విపరీతంగా ఆవరించింది. దీంతో వాహనచోదకులు సైతం కళ్లు మండుతున్నాయంటూ ఇబ్బంది పడ్డారు. దొమ్మేటిపేట వద్ద ఉన్న పేపర్‌మిల్లుకు సంబంధించి వేస్ట్ మెటీరియల్‌ను టిప్పర్ల ద్వారా తరలించి స్థానిక నీలపల్లి గ్రామం ఎదురుగా ఉన్న ప్రాంతంలో కాల్చడం వల్లే పొగ వ్యాపిస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే మంటలను తాము పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చామని యానాం అగ్నిమాపక దళ సిబ్బంది తెలిపారు.

రైతుల బ్యాంక్ ఖాతాలకు మిచాంగ్ తుపాన్ పరిహారం



వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ

అల్లవరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో గతేడాది డిసెంబర్‌లో కురిసిన అధిక వర్షాల కారణంగా ఖరీఫ్ పంట కాలానికి తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గడిచిన ఖరీఫ్‌లో సుమారు 1344 ఎకరాల్లో పంట నష్టాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 1,058 మంది రైతులకు 1,344 ఎకరాలకు రూ.98.35 లక్షల పరిహారాన్ని డీబీటీ విధానంలో రైతుల బ్యాంక్ ఖాతాలను నేరుగా జమ చేస్తున్నారని ఏఓ తెలిపారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక నేతలు



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాళ్లరేవు: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య సమకాలీన రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సుందరయ్య వర్ధంతిని స్థానిక ప్రజా సంఘాల భవనంలో టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో సుందరయ్య చేసిన వీరోచిత పోరాటాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎలిపే నాగేశ్వరరావు, అత్తిలి బాబూరావు, వల్లు రాజబాబు, ఇంజినీర్ సత్యనారాయణ, పాలెపు ఈశ్వరరావు, ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

యానాం: ప్రజా సమస్యలపై పుచ్చలపల్లి సుందరయ్య చేసిన అలుపెరగని పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గా ప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 17 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా, 5 ఏళ్ల పాటు ఎంపీగా పనిచేసిన ఆయన ఉత్తమ చట్టసభ సభ్యుడిగా కీర్తి గడించారన్నారు. అంతకుముందు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీవీ సత్యనారాయణ, కుంచె సత్యనారాయణ, తిక్కవరపు శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, పిల్లి నూకరాజు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను ఆదివారం అమలాపురం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. సభకు సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అండ్రా మాల్యాద్రి మాట్లాడుతూ సుందరయ్య జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, తాడి శ్రీరామ్ మూర్తి, కేవీ సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, విప్పర్తి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నీలాల నింగిలో అందాల మేఘమాల



గొల్లవిల్లిలో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న మేఘాలు

ఉప్పలగుప్తం: గత నాలుగు రోజులుగా వాతావరణం వేడెక్కి మళ్లీ ఉష్ణోగ్రతలు పెరగటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. తిరిగి ఆదివారం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ సందర్భంగా ఆకాశంలో అల్లుకున్న అందాల నీలి మేఘాలు చూపరులను కట్టిపడేశాయి. మెరిసే వెండి మబ్బులు కనులకు విందు చేశాయి. ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని ఆదివారం సాక్షి తన కెమెరాలో బంధించింది.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం



మిత్రుడు షరీఫ్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న తోటి స్నేహితులు

మలికిపురం: తమ స్నేహితుని ఇంటి నిర్మాణంలో తోటు స్నేహితులు పాలు పంచుకున్నారు. పదో తరగతి కలసి చదువుకున్న 1988–89 టెన్త్ క్లాస్ బ్యాచ్ వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వారంతా వాట్సాప్ ద్వారా గ్రూపుగా ఏర్పడి ఒకరికొకరు మాట్లాడుకుంటూ ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తమతో చదువుకున్న పేద అయిన తోటి స్నేహితుడు ఇల్లు నిర్మించుకోవడానికి సాయం అందించారు. రూ.40 వేలను సేకరించి ఆదివారం మలికిపురంలోని వారి స్నేహితుడు షరీఫ్‌కి అందించారు. లండన్‌లో ఉద్యోగం చేస్తున్న ఆరేటి శ్రీనివాస్, కువైట్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్న మేడిది కిరణ్‌కుమార్, పిల్లి ఆనందరావు, స్థానికంగా ఉంటున్న నల్లి శివకుమార్, గుబ్బల శ్రీనివాస్, ఉపాధ్యాయుడు రహీం, లింగోలు సత్యనారాయణమూర్తిలు కలసి షరీఫ్‌కు ఆ సొమ్ము అందించారు.

ఉపాధికి హామీ.. కూలి పెంపు

- చురుగ్గా సాగుతున్న ఉపాధి హామీ పనులు
- కూలీల కనీస వేతనం రోజుకు రూ.272 నుంచి రూ.300కు పెంపు



ఐ.పోలవరంలో పంట బోదెను బాగు చేస్తున్న ఉపాధి కూలీలు

ఐ.పోలవరం: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిరుపేద కూలీల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతుండడంతో పేదల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. నియోజకవర్గంలోని ఐ.పోలవరం మండలంలో ఇప్పటికే వ్యవసాయ పనులు, కాలువల అభివృద్ధి, చెరువుల పూడికతీతలు చేస్తున్నారు. మరోవైపు వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో కూలీలంతా బిజీబిజీగా గడుపుతున్నారు. వ్యవసాయ పనుల అనంతరం కూలీలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు కల్పించి జీవనోపాధికి ఊతమిచ్చేందుకు అధికారులు సమగ్ర చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు ఉన్న కనీస వేతనం రూ.272 నుంచి రూ.300కు పెరిగింది. దీంతో ఒక్కో కూలీకి రోజుకు సగటున రూ.28 పెరిగినట్టయింది. మండలంలో రూ.6 కోట్లతో 800 పనులు చేస్తున్నారు. ఈ పనులు జూన్ నెలాఖరులోపు పూర్తి కానున్నట్లు ఏపీడీ టి.రామారావు తెలిపారు. కొమరగిరి, కేశనకుర్రు గ్రామాల్లో చెరువు పనులు, మండలంలోని అన్ని గ్రామాల్లో కాలువల్లో పూడిక తీత పనులు సాగుతున్నాయి.

పెరిగిన వేతనంతో ఎంతో మేలు



ఉపాధి హామీ పథకంలో వేతనం పెరగటం వల్ల మాలాంటి కూలీలకు ఎంతో మేలు జరుగుతుంది. ఏటా వంద రోజులు పని కల్పిస్తూ కనీస వేతనం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రుణపడి ఉంటాం.

– గంటి గోవిందు, పాతయింజరం

రోజుకు రూ.28 పెరిగింది



ఎన్ఆర్‌జీఈఎస్ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనం రోజుకి రూ.28 పెరిగింది. దీనివల్ల కూలీల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశముంది. కూలీలు పనిచేసే దాన్ని బట్టి వారి సగటు వేతనం వస్తుంది.

– తోట రామారావు, ఏపీడీ, ఐ.పోలవరం

కష్టపడి అనుకున్న లక్ష్యం సాధించాలి



విద్యార్థిని శ్రీరామదుర్గను సన్మానిస్తున్న సర్పంచ్ చిన్ని, ఎంపీటీసీ జంగమయ్య

మామిడికుదురు: కష్టపడి చదువుకుని అనుకున్న లక్ష్యం సాధించాలని పెదపట్నంలంక సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య అభిలషించారు. పెదపట్నంలంకకు చెందిన గిడుగు శ్రీరామదుర్గ ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఆదివారం శ్రీరామదుర్గను సర్పంచ్, ఎంపీటీసీ ఘనంగా సత్కరించారు. విద్యార్థిని శ్రీరామదుర్గకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఆమె మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరినాథ్, పీఎంసీ చైర్మన్ గిడుగు విజయనారాయణమూర్తి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

మలికిపురం: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దిండిలో జరిగిన ప్రమాదంలో ప్రైవేట్ బస్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మండలంలోని బట్టేలంకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు.

అకాల వర్షంతో రైతుల ఇక్కట్లు



గంగలకుర్రులో ధాన్యం రాశిపై బరకాన్ని కప్పుతున్న రైతు

అంబాజీపేట: మండు వేసవిలో వాతావరణం చల్లబడి ఉరుములతో అకాల వర్షం కురవడంతో రైతులు కళ్లాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తుంది. గత వారం రోజులుగా అకాల వర్షానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. చేలల్లో ఉన్న ధాన్యాన్ని గట్టుకు చేర్చి ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎప్పుడు వాతావరణం మారుతుందో.. వర్షం కురుస్తుందో.. ఆరబెట్టిన ధాన్యాన్ని ఎలా సంరక్షించుకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడిచిన ధాన్యాన్ని ఒక పక్క, తేమ ఉన్న ధాన్యాన్ని మరోపక్క బరకాలపై ఆరబెట్టుకుంటున్నారు. తడిచిన ధాన్యం రంగు మారి ధర లేకుండా పోతుందనే భయాందోళనకు గురవుతున్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు



లూటుకుర్రులో సామూహిక అష్టోత్తర శత కలశ పూజలో పాల్గొన్న ముత్తైదువలు

అయినవిల్లి: పోతుకుర్రు గ్రామదేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లికి ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జాతర మహోత్సవాలు నిర్వహించారు. పొలాల మధ్య తాడిచెట్టు రూపంలో అమ్మవారు కొలువై ఉన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా అష్టోత్తర శత కలశ పూజ

మామిడికుదురు: లూటుకుర్రు బోణం మెరకలో కొలువుదీరిన గ్రామ దేవత పళ్లాలమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ఆదివారం అష్టోత్తర శత కలశ పూజ ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ పూజ ఆద్యంతం కనుల పండువలా జరిగింది. ముత్తైదువులతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వివిధ పుష్ప, ఫలార్చనలు ఘనంగా జరిపించారు. పలు రకాల మిఠాయిలు, వంట కాలతో అమ్మవారికి విశేష మహా నివేదన సమర్పించారు. పలు హోమాలను జరిపించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. జాతర పురస్కరించుకుని పలు రకాల బెంగళూరు పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.



గొందిలో కొలువైన కనక ముత్యాలమ్మ

కనక ముత్యాలమ్మ జాతర

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలో కొలువైన కనక ముత్యాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ఆదివారం తెలిపింది. భక్తులకు కనువిందు చేసే సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కమిటీ పేర్కొంది. నాలుగు రోజుల పాటు జరుగనున్న ఈ మహోత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి అనుగ్రహం పొందాల్సిందిగా కమిటీ విజ్ఞప్తి చేసింది.